# సంఘర్షణ

ఉరుములతో, మెరుపులతో, పెటపెటార్భాటాలతో కుంభవృష్టి కురిసి వెలిసిన ట్టుగా ఉందా గ్రామం. అంతకు ముందా ఊళ్ళో జరిగిన పోరాటాలు వెలికి తీసిన వైరుధ్యాలు లసుమయ్య పంచాయతీని తెగనీయడం లేదు.

ఆ పంచాయితీ ఉన్న వాళ్ళు, లేనివాళ్ళు మధ్య పంచాయితీగా ప్రారంభమై; యువతరం, వృద్ధతరం  మధ్య ఘర్షణగా పరిణామం చెందింది. ఈ రెండేళ్ళకాలంలో మూడు నాలుగు సార్లు పంచాయతీకి  కూర్చున్నా ఎటూ తేల్చకుండానే లేచిపోయారు పెద్దమనుషులు.

అయితే, ఈ విషయంలో ఏదో నిర్ణయం తీసుకోవడానికి ఊరి పంచాయతీ పెద్దలంతా ఆరోజు ఊరిమధ్యలో  ఉన్న చెట్టు కింద సమావేశమవుతున్నారు. ఇప్పుడు పంచాయితీ పెద్దలంతా అగ్రకులాలవాళ్ళు, వృద్ధులూ మాత్రమే కాదు, కొంతమంది పాతవాళ్ళతోపాటు అన్ని కులాలకు చెందిన యువకులూ  ఉన్నారు. హరిజన యువకులూ ఉన్నారు.

మధ్యాహ్న సమయం. సూర్యుడు నడినెత్తిమీద కొచ్చి తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. పనులన్నీ  తీరిన వేసవి కాల మవడం వల్ల చాలా మంది ఆ పంచాయితీ చూడటానికక్కడకు చేరుకుంటున్నారు. కొట్టాల్లో కట్టివేయబడిన పశువులు వరిగడ్డి నెమరువేస్తూ కునుకులు తీస్తున్నాయి. కోళ్ళు ఎండ  వేడికి తాళలేక వాకిళ్ళలో పొక్కిల్లు చేసి మట్టితో తమ రెక్కల చాటున పిల్లలను దాచుకొని వగరుకొడ్తున్నాయి. కుక్కలు నాలుకలు బయటకు చాపి చొంగ కారుస్తున్నాయి.

కొద్ది సేపట్లో పెద్దలతో పాటు చాలా మంది చెట్టుకిందికి చేరుకున్నారు. అన్ని వతన్లు పోయినా  పోకుండా మిగిలి వున్న 'సుంకరి' తనం చేసేవాళ్లు బరిసెలు పట్టుకొని నిల్చొని వున్నారు. అక్కడున్న ఖాళీస్థలమంతా జనంతో నిండిపోయింది. గద్దెమీద పంచాయతీ పెద్దలు కూర్చొనున్నారు.  అందర్నీ కలియజూసాడు కొండల్‌రావు. అతడు మాజీ సర్పంచ్. మొట్టమొదటి ఎన్నికల్నుండి పదేళ్ళ  క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల వరకూ అతడే ఆ ఊరికి సర్పంచ్. గత ఎన్నికల్లో యువకుడైన రాజన్న  చేతిలో అతడోడిపోయాడు. అతని గత అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని రాజన్న పంచాయితీ  మెంబర్లలో ఒకనిగా అతన్ని తీసుకున్నాడు.

"అందరూ వచ్చినట్టే కదా..."అన్నాడు కొండల్‌రావు...

"అందరూ వచ్చింద్రు..."

"అయితే పంచాయితీ మొదలు పెడదాం..." అన్నాడు రాజన్న.

సరాయించి గొంతును సవరించుకున్నాడు కొండల్ రావు...

"మనం కరువులను, కాలాలను జూసినం... కష్టసుఖాలను జూసినం. మంచిని, చెడ్డను జూసినం. నాకు తలవెంట్రుకలన్ని అనుభవాలున్నాయి. కడపలోపలున్న సుఖం కాశికి పోయినా దొరకదన్నారు పెద్దలు. పెద్దల మాట చద్దన్నపు మూటన్నారు. మనమింత వరకు నోటిమాట బయటపడకుండా బతికినం. మనల్ని మనం బయటేసుకుంటే నష్టపోయేది మనమే. ఇన్ని రోజులు మనం ఊళ్ళన్ని బెగ్గంపాడైంది జూసినం. జైళ్ళు, కొట్లాటలు, దంపులాటలు జూసినం. వాటి మంచి చెడ్డల గూర్చి నేను చెప్పడంలేదు. నేను చెప్పేదేమంటే లసుమయ్య పంచాయితీనింకా పొడిగించకూడదు. ఏదో విధంగా పరిష్కరించుకుందాం..." అని అగాడు.

"వద్దని ఎవరన్నరు...? ఎట్లా చేస్తవో చెప్పరాదు మరి..."

"ఎట్లేంది...? బాకి గట్టమంటుండు... గంతే కదా...!"

యువకుల్లోంచి రకరకాల మాటలు వినవచ్చాయి.

"ఈ తొందరపాటే నేను వద్దనేది. నేనేం చెబుతున్నానో పూర్తిగా వినకుండానే తీర్పిచ్చినట్టే మాట్లాడితే ఎలా...? నాకు లసుమయ్య, వైకుంఠం ఇద్దరూ కావాల్సినవాళ్ళే... వాళ్ళిద్దరికీ న్యాయం జరగాలన్నదే నా ఉద్దేశ్యం... అయితే, మార్పులెన్ని వచ్చినా ఊరి కట్టుబాట్లను, నియమాలను పాటించాలన్నదే నా అభిప్రాయం.." అన్నాడు కొండల్ రావు.

"ఎహే పో... గీ సోదంతెందుకు? అందరి కాళ్ళు చేతులు కట్టేసి గప్పుడు మొదలుపెడతవా పంచాయితి...? అసలు సంగతి చెప్పక ఇవన్నెందుకు?" అన్నాడు రమేష్. రతన్ రమేష్‌ను సమర్థించాడు.

"రతన్, రమేష్! మీరు కొంచెమాగుండ్రి. నలుగురున్న చోటే దేవుడున్నడంటారు. పంచాయతన్నప్పుడు నలుగురు నాలుగు రకాలుగా చెబుతారు. ఒకేసారి కుండబద్దలు కొట్టినట్టు చెప్పడం సాధ్యం కాదు. తొందర పడకూడదు" అని, "లసుమయ్యా! సంగతేందో చెప్పు" అన్నాడు సర్పంచ్ రాజన్న.

"ఏం జెప్పాలె పటేలా! రామాయణమంతా విని రామునికి సీతేంగావాలెనని అడిగినట్టుంది కత. చెప్పిందే చెప్పుడు ఎన్నిసార్లు జెప్పాలె.?"

లసుమయ్య మాటలు విని కిసుక్కున నవ్వారు కొందరు.

"ఇదువరకు చెప్పితే చెప్పినవు. ఇయ్యాల్లనైతే చెప్పలేదు గదా... అందరు వినంది పంచాయితెట్ల జేస్తరు? చెప్పటానికే బరువైతందా నీకు?" లసుమయ్య నుద్దేశించి అన్నాడు మనోహర్ రెడ్డి.

"మీరంతా చెప్పమన్నంక చెప్పక తప్పుతదా? మల్లేం జెప్పాలే? చెప్పి చెప్పి నా నోరంత పాడాయె. పెద్ద మనుషుల ఇండ్ల పొంటి తిరిగి తిరిగి నా కాళ్ళరిగె. నన్నెవలు పట్టిచ్చుకున్నరు...?" అరవై ఏళ్ళు పైబడిన వృద్ధాప్యాన్ని మోస్తున్న లసుమయ్య గబగబా మాట్లాడలేకపోతున్నాడు.

"మేం పట్టించుకుంటాం తాతా! నువ్వైతే చెప్పు... నిన్నెవ్వలేం జేస్తరో మేం జూస్తం!" అన్నాడో యువకుడు.

"చెప్పుతాతా చెప్పు..." అరిచారు మరి కొందరు యువకులు.

"ఇదంత పీడేంది? నేను బాకి లేనేంలేనని తడిబట్టల్తోని గుళ్లె జొర్రలేవు ఒడ్సపోతది! పంచాయితయిపోయినట్టే" అన్నాడు ఆనందయ్య.

"అట్లనుటానికి నేను కట్టెకోత కులంల పుట్టలే. కూసుండి సుత్తిగొట్టి గోర్లల్ల బంగారమిరికించుకోని బతికిన జాతిగాదు నాది. నేను భూమిని నమ్ముకొని బతుకుతున్న. మట్లె మన్నె బొర్లి బతుకుతన్న... గా లఫంగా మాటలు నాకు రావు. ఏది మాట్లాడినా నాభిల గుద్దినట్టే మాట్లాడుతడు అవుసులయినె..." అన్నాడు లసుమయ్య.

"ఆనందయ్యా! నువ్వాగు... మధ్యలో ఎవ్వలు మాట్లాడద్దు..." అని, "లసుమయ్యా! సంగతేందో పూర్తిగా చెప్పు...!" అన్నాడు చంద్రారెడ్డి.

"నేను వైకుంఠం షావుకారి దగ్గర బాకి తీసుకోలేదంటలేను. తీసుకున్న, ఒక్క పైస గాదు... రెండు పైసలుగాదు... ఐదు వెయిల రూపాల్దీసుకున్న... ఎప్పుడనుకున్నరు? దగ్గర దగ్గర ఇరువయ్యైదేండ్ల కింద. గపుడు నా బిడ్డ పదిగేనేండ్లది. దాని లగ్గం జేసుటానికి బాకి దీసుకున్న. దాని లగ్గమైంది. పిల్లలైండ్రు. దాని పిల్లలకు గూడ లగ్గమైంది. నా బిడ్డకు నిరుడే మనమరాలు కూడా పుట్టింది. నేను బాకి దీసుకున్నప్పుడు నా కొడుక్కు పదేండ్లు. నేను బాకి తీసుకోలేదంటలేను. వైకుంఠం షావుకారి ఎక్కడ సంతుక మొత్తు మంటే అక్కడొత్తి తీసుకున్న అటెనుక వాయిదాలు మళ్ళీ మల్లరాత్తె వాటిమీద గూడ సంతుకమొత్తిన..." ఆగాడు లసుమయ్య.

"మరటువంటప్పుడింకేంది? బాకి తీసుకొని కట్టవా మరి?" అన్నాడు ముఖం అదోలా పెట్టి లక్షణరావు.

"అయ్యోదొర... ఆగలేవు... లావేగిరపడ్తివేంది? లసుమయ్యను పురాగ సెప్పనీయల్లేవు." అన్నాడు గౌండ్ల వెంకటనర్సు

"చింత జచ్చినా పులుపు సావలేదన్నట్టు దొరలకు తొందరెక్కువ. లసుమయ్యతోని ఉన్న భూమినమ్మిచ్చి బాకి గట్టిపిస్తే దొరలకు సంబురం గుంటది..." అన్నాడు సురేష్.

"గీ కారెడ్డాలన్నెందుగ్గని లసుమయ్యం జెప్పనియ్యండ్రి..." అన్నాడు ఓదేలు...

లసుమయ్య తన బాకీ కథ చెప్పుకుపోతున్నాడు:

"గప్పుడు వైకుంఠం షావుకారికి నాకు నడుమ సంబంధాలు మంచిగనే ఉండేటియి. అయినేమనుకున్నడో తెలువది కాని, నేనైతతే షావుకార్ని పురాగ నమ్మిన. నా బిడ్డ లగ్గానికి బాకీ ఇత్తనంటె సంబురపడ్డ. గీ షావుకారికున్న దొరకు అప్పుడు మంచి సోపతుండె... ఇంకో దొరతోని గూడ గంతే. ఒగలమాటనొగలు తియ్యకపోదురు... గిప్పుడు గా దొరలు ఊళ్ళిడిసిపెట్టి పట్నంల ఉంటున్న సంగతి మనకెరికే... గా దొరల ముంగట్నే కాయిదాలు రాయించాడు షావుకారి. నాలుగు వేలిచ్చి ఐదువేలకు

రాయించుకున్నాడు. గదేందంటే అర్నెల్లు మిత్తి ముందే ఉంచకుంటనన్నడు. నీ దగ్గెరెక్కువ తీసుకుంటనా అన్నడు. అందరికి గంతే నన్నడు. బెల్లపు మాటలు మాట్లాడిండు. అంతకు ముందు నేను ఐదూ పదే కని వెయిల బాకీ తెచ్చుకోలే. దొరగూడ షావుకారి జెప్పిందే రైటంటే నేను కావచ్చునుకున్న.

అర్నెల్లయినంక మిత్తిడిగిండు. మొదలే ఉంచుకుంటువి గదన్న. ఎప్పుడూ అర్నెల్లు ముందే ఇయ్యాలన్నాడు. గీరంపాట్యాలన్ని నాకేమెరుక? సరెననీ నాకిచ్చిన వడ్లు గొర్చిన... ఏవేవో కాకి లెక్కల్జేసిండు. గట్లనే పదేండ్లు పంట పంటకు వడ్లు కొలుస్తనే ఉన్న. అటెనుక నాకొడుగెదిగిండు. గిదేందే నాయిన్నని అడిగిండు. నేం జెప్పిన. అడేదేదో లెక్కలు గట్టిండు. ఇదువరకు గట్టిందే ఎక్కువన్నడు. అసలూ వడ్డీ అన్న ముట్టిన యన్నడు. ఓసారి షావుకారడిగితే గదే మాటన్నడు.

"గప్పుడు ఎగిరెగిరి దునికిండనుకుంట షావుకారి..." ఒకతనన్నాడు.

"అవు... శివం దూరి నట్టెగిరిండు... అస్సోయిధూలనెరిండు. దొర దగ్గరికి మా నాయిన్నను పిలిపించిండు." అన్నాడు లసుమయ్య కొడుకు కొంరయ్య.

"దొరేమన్నాడు షావుకారి...?" అడిగాడు రాజన్న.

అంతవరకు చెట్టునానుకొని కూర్చున్న వైకుంఠం లేచి నిల్చున్నాడు. అందరికి దండం బెట్టాడు.

"లోకంల నియ్యతి లేకుంటయిపోయింది. నోట్లె నాలికలేని కొమటోన్ని నేను... నా కన్యాయం జెయ్యకుండ్రి, మీరంత పెద్దలోకులు. నేనేమో తరాజును నమ్ముకొని బతికెటోన్ని. బజ్జీలమ్ముకొని సంపాదించుకున్న. లసుమయ్యేట్ల జెప్పిండో సూడుండ్రి. ఏలువెడితె కొరుకని, వెన్నబెడితె నాకని చిన్నపిల్లగానోలె జెప్పిండు. లసుమయ్య అర్నెల్లకోసారి వడ్లు గొలిస్తే నేను గుమ్మలు, గరిసెలు నింపుకున్ననా? ఇచ్చినోడు ఎంతిచ్చిండో కాగిదం మీద రాయించుకోడా? గంతమాయకుడా లసుమయ్య? నా ఇమానంగ లసుమయ్య నాకేమియ్యలే... ఒక్కసారో, రెండుసార్లనో నాలుగు, నాలుగు గిద్దెల వడ్లు కొల్సిండు. నాకు గీ చిక్కులన్ని తెలువదు. దొరయిన, దాతయిన కాగితం మీదున్నది కాదంటాడా? గదే మాట జెప్పిండు దొర...! నేనే ఇప్పుడు లోతుల పడున్న. నా ఉసురు పోసుకోకుండ్రి. నా పైసలు నాకిప్పియ్యండ్రి" అన్నాడు వైకుంఠం.

"అబ్బ, నీయవ్వ కొమటయినె.. ఎంత పొతంగా మాట్లాడిండో సూడుండ్రి. కిందకుండ కిందుండంగ మీదకుండ మీదుండంగ నడిమికుండ తప్పిచ్చెటోడీనె. నవ్వుకుంట నవ్వుకుంటనే రైక ముడిడుత్తడు..."

గాండ్ల రాజయ్య మాటలకంతా నవ్వారు.

"నువ్వేమంటావు లసుమయ్య...?" అడిగాడు కొండల్‌రావు.

"అనుటానికేమున్నదిండ్ల...? షావుకారంత నియ్యతిగల మనిషే లేడనుకోండ్రి! షావుకారితోని, దొరతోని ఎన్నిసార్లు వాదించినా బాకి గట్టుడే అన్నరు. నేను

కడుదామనే అనుకున్న... కని నా కొడుకు ఒప్పకోలే... ఎదిగిన కొడుకుమాట నేనెట్ల గాదనాలె...? అందుకే ఏదయితే గదయితదని ఊకున్న..." అన్నాడు లసుమయ్య.

"మరి నువ్విచ్చిన ధాన్యం గురించి ఎందుకు రాయించుకోలే..."

"నాకు గంత తెలివున్నంక గింత దూరమత్తదా బాంచెను. మనూరోడని నమ్మిన... చిన్నప్పట్నుంచి చూస్తున్న షావుకారేనని నమ్మిన... మనసుల గింత విషం బెట్టుకుంటడనుకోలేదు. దొర కాగితంల ఉన్నట్టు చెయ్యాలన్నడు... నా కొడుకు అసలే ఇయ్యద్దన్నడు. గప్పుడు గప్పుడే ఊళ్ళళ్ళ లొల్లులు మొదలైతున్నయి. అన్నలస్తున్నరూళ్ళెకు. ఆ లొల్లులు లేకుంటే ఏమయ్యేదో తెలువది కాని షావుకారి నన్ను బలవంతం చెయ్యక కోర్టుకు బోయిండు. ఊళ్లె కొందరు షావుకార్ని, కొందరు నన్ను కొండెక్కిచ్చిండ్రు. ఇద్దరితోని మేమే గెలుత్తమని చెప్పిండ్రు. మాకు పౌరుషాలు పెరిగినై. ఐదేండ్లు వకీల్ల చుట్టూ, పైరవికార్ల చుట్టు తిరిగి తిరిగి చెప్పలరిగినయి. ఇద్దరికీ మస్తు ఖర్చయినయి... వాటితోని బాకి దీర్చినా అయిపోవు. షావుకారన్న తను ఖర్చు పెట్టక బాకీ తీరిందనుకున్నా పంచాయితుండకపోవు. అటెనుక యాష్టకచ్చి ఇద్దరం కలిసి కేసును తీసుకున్నం... " చెప్పాడు లసుమయ్య.

"ఆ తర్వాతేమైంది...?"

"కొద్ది రోజులూకున్నడు షావుకారి. అటెనుక అసలు, వడ్డీ కలిపి ఇరువయ్యైదు వేలైన యన్నడు. బాకియ్యకుంటె పొలం జప్తు చేసుకుంటనన్నడు. నా కొడుకు ఎదురు తిరిగిండు. పుచ్చెలెగురతయన్నడు. ఊళ్ళళ్ళ అన్నల ప్రభావం బాగ పెరిగింది. నా కొడుకు వాళ్ళతోని చెప్పిండు. షావుకారి కుక్కిన పేనోలె ఊకున్నడు. ఇగ వాటి జోలెత్తలే...!"

"ఇదంత నిజమేనా వైకుంఠం...?"

"సమయం మనది గానప్పుడేం జేత్తం...? బాకి బాకే...ఎన్నొద్దులైనా ఎక్కడికి పోతదని ఊకున్న - కాగితం మీదపడ్డది కాల్లెకు పోయినా పోదని నాకెరికే...ఇదం తెందుకు...? లసుమయ్యని నా దగ్గర బాకి తీసుకోలేదని దేవుని గుళ్ళె చొచ్చి ప్రమాణం చెయ్యమనుండ్రి. అందరి ముందట కాగిదాలు చింపెయ్యమనుండ్రి... ఊకుంట..." అన్నాడు వైకుంఠం...

"ఏం, లసుమయ్య కాగిదాలు చింపేస్తవా...? చెప్పు."

కాగిదాలు చింపేసే పనుల్లాంటివి 'లంగలు' చేసే పనులని లసుమయ్యకు తెలుసు. ఇంతకాలం నిజాయితీగా బతికి చివరిదశలో 'లంగా'గా ముద్ర వేసుకోవటం అతనికిష్టంలేదు. గ్రామీణ రైతు మనస్తత్వాన్ని సంపూర్ణంగా జీర్ణించుకున్న లసుమయ్య అలాంటి అప్రతిష్ఠ పని చేయదలుచుకోలేదు. పెద్దమనుషులను ఒప్పించి న్యాయసమ్మతంగా తాను బాకీ తీర్చేసానని అనిపించుకోవాలన్నదే లసుమయ్య అభిప్రాయం. బాకీ ఎగగొట్టానని అనిపించుకోవడం కాదు. అంతగా అయితే ఎంతో కొంత బాకి తీర్చడానికే సిద్ధంగా ఉన్నాడు కాని, అలాంటి పేరు తెచ్చుకోవడానికి కాదు.

లసుమయ్య ఆలోచిస్తూ ఏం మాట్లాడటం లేదు... కొద్దిసేపాగి కొంరయ్య ముందుకొచ్చాడు.

"నేను చింపుతియ్యంండ్రి కాయిదాలు... మేమిదివరకు కట్టిందే ఎక్కువని ప్రమాణం జేసి చింపేస్త..." అన్నాడు.

తండ్రితరం, కొడుకుతరం మధ్యగల అంతరాన్ని బేరీజు వేస్తున్నారు వృద్ధులు... కొంరయ్య నాశ్చర్యంగా చూస్తున్నారు...

"కాగిదాలు చింపేస్తే బాకి అయిపోయినట్టే అంటున్నాడు గదా షావుకారి... నా కొడుకు చింపుతనంటండు. ఇచ్చెయండ్రి. నాకున్న భయం, పాపభీతి నా కొడుక్కు లేవు... నా కొడుక్కున్న తెగువ నాకు లేదు. ఇంకేంది, ఇచ్చెయ్యండ్రి..." అన్నాడు లసుమయ్య.

లసుమయ్య నందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. కొంద రాతని మాటలను సమర్థిస్తున్నారు. కొందరు విమర్శిస్తున్నారు.

"సీయవ్వ, లోకమంతెట్లున్నది..."

"ఎవ్వలకేమన్న చెప్పవచ్చెటట్టున్నదా...?"

"ఎవ్వలను నమ్మ్మడో తెలుస్తలేదు..."

రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

"ఏమంటవు వైకుంఠం...? లసుమయ్య మాటలు విన్నావుగదా...!" అన్నాడు రాజన్న.

ఆ మాటలకు కొంత జంకాడు వైకుంఠం. కాగిదాలు చించేస్తే తానూర్కుంటాడా? లసుమయ్య బలహీనతేంటో వైకుంఠంకు తెలుసు. కొద్దిక్షణాల్లో అతనిలో ఎన్నో ఆలోచనలు సుళ్ళు దిరిగాయి.

"నేను బాకిచ్చింది లసుమయ్యకు, కొంరయ్యకు గాదు. ఏదన్న చేస్తే తండ్రి చేయాలెగాని కొడుకు జేస్తె ఎందుకొప్పుకుంట...?" అన్నాడు.

ఈ తతంగమంతా లసుమయ్యకు బాధాకరంగా ఉంది. ఆ బాకీ కిందికి డబ్బు, ధాన్యంతో పాటు ఇంకేం కోల్పోయాడో లసుమయ్యకు తెలుసు. అయితే, ఆ విషయాన్ని ఇంతకాలం దాచుంచాడు. ఇప్పుడు తాను బాకీ కిందికి భూమి నివ్వడానికి సిద్ధంగానే ఉన్నాడు. కాని కొంరయ్య ఉన్న భూమిని వదులుకొని ఎవరికిందో బానిసగా బతకడానికి సిద్ధంగా లేడన్న విషయం లసుమయ్యకు తెలుసు... భూమిని దక్కించుకోవడానికి ఇంతకాలంగా దాచి ఉంచిన రహస్యాన్ని బయట పెట్టడానికే నిర్ణయించుకున్నాడు లసుమయ్య.

"పెద్ద లోకులంతా చెవిపెట్టి వినండ్రి... నేనే ఆయనకు బాకో, షావుకారే నాకు బాకో విన్నంక చెప్పండ్రి. నేను పండించిన దినుసు, పైసలిచ్చుడే కాకుండా బాకీ కిందికి షావుకారి ఏ పని జెప్పితే ఆ పని జేసినం. ఇన్రోజులు దాచిన సంగతిప్పుడు సిగ్గువిడిచి చెబుతున్న... నా భార్యను గూడ ఘోరంగా వాడుకున్నడు షావుకారి..." అని అవమాన భారంతో తలవంచుకున్నాడు లసుమయ్య.

తండ్రి మాటలు విన్న కొంరయ్య కండ్లు చింతనిప్పులయ్యాయి. షావుకారి మెడ పిసికి పారేద్దా మన్నంత కోపం పెల్లుబికి వస్తోంది. ఊరి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, తాను చేయి జేసుకుంటే జరుగబోయే పరిణామాలను తలుచుకుని తనను తాను నిగ్రహించుకున్నాడు.

అక్కడున్న చాలామంది వైకుంఠంను 'ఛీ ఛీ' అన్నారు.

"ఇంత పాపముంటదా...?" అన్నారు.

"వైకుంఠం నేంజేసినా పాపం లేదు... షావుకారే లసుమయ్యకియ్యాలె..."

రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

"అయ్యో! అయ్యో! నాకు గివ్వన్నే మెరుక...? నామీద అనవసరంగ నిందమోపుతండు లసుమయ్య...! నా బాకి ఎగ్గొట్టటానికి జూటమాటలు జెప్పుతండు. దేవున్తోడు నాకేం దెలువది. కాగిదం మీదున్నట్టు నా పైసలు నాకిప్పియ్యండ్రి... ఇప్పటికే నేం దివాళ దీసున్న..." లబో దిబోమని మొత్తుకుంటూ అన్నాడు వైకుంఠం.

కొందరు వైకుంఠమే నాటకమాడుతున్నాడంటే, మరికొందరు లసుమయ్యే అబద్దాలాడుతున్నాడంటున్నారు. కొందరు బాకిని ఎగవేయడమే మంచిదంటే, ఇంకొందరు బాకీ గట్టడమే న్యాయమంటున్నారు. కాగితం మీదున్నట్టు నడవాలని కొందరంటే, కాగితం గీగితం జాన్తా నహీ అని కొందరంటున్నారు. ఇరువైపుల వారికీ మద్దతుగా, వ్యతిరేకంగా మాటలు సాగుతూనే ఉన్నాయి.

పెద్దమనుషులు తర్జనభర్జన పడుతున్నారు.

లసుమయ్యలో సంఘర్షణ జరుగుతోంది. కొంరయ్య ఆవేశాన్ని అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

కొద్దిసేపాగి "లసుమయ్యా! జరిగిందేదో జరిగిపోయింది. దీన్నింకా పొడిగించుడేం బాగుండదు. వైకుంఠం పరిస్థితి కూడా మంచిగేం లేదు. అన్నలచ్చి అప్పు పత్రాలన్ని చింపేసింగ్రు. వైకుంఠం దగ్గర డబ్బులు వసూలు చేసింగ్రు. అతను కూడా కష్టాల్లోనే ఉన్నాడు. బాకీ కిందికి నువ్వా పొలాన్ని విడిచిపెట్టు... ఎంతో కొంత డబ్బు నీకు ఇచ్చేటట్టు చేస్తాం. బీసా, ఉన్నిసా అన్నట్లు సల్లుబిగి ఉండాలెగాని పట్టువట్టుకొనుంటెట్ల? మరి నీకు పొలమే కావన్నంటే బాకిగట్టు. .. కొంచెమంత మాఫి చేయిస్తం." అన్నాడు మనోహర్ రెడ్డి.

"దొర జెప్పింది నిజం. నా పైసలు నాకిప్పియ్యండ్రి. ఊళ్ళె వచ్చే అడుగుబొడుగు బాకీలు వసూలు జేసుకొని వెళ్ళిపోత. నన్నిక్కడ బతకనియ్యరు" అన్నాడు వైకుంఠం.

ప్రస్తుతానికి కొంత ప్రశాంతంగా ఉన్నట్టనిపించినా మళ్ళీ ఎప్పుడు ముంచుకొస్తుం దోనని వైకుంఠం భయపడుతున్నాడు. వీలైనంత త్వరగా ఊళ్ళోంచి వెళ్ళిపోవడానికే ప్రయత్నిస్తున్నాడు.

"అప్పుడే అన్నలు లసుమయ్య కాయిదం గూడ చింపేత్తె పీడపాయ్యేది గద."

"మనోహర్ రెడ్డి బాగనే చెప్పుతుండు? వైకుంఠం సంగతెట్లున్నదో చూదుండ్రి..."

"వాళ్ళకంటికి కొన్ని కాగితాలు కనపడలే..."

కొందరు లసుమయ్యను సమర్థిస్తూ మాట్లాడుతున్నరు.

"లసుమయ్యా! ఇది గుర్రం... అది మైదానం... ఈ పంచాయితీ ఏదో విధంగా ఈ రోజే పరిష్కారం కావాలి. పొలమన్న వదిలిపెట్టు... బాకన్న గట్టు. లేకుంటే ఎవ్వలేమన్న అనుకోనియ్యి. లంగ, బద్మాష్ అనుకోనియ్యని కాగిదాలు చింపెయ్యి. కాగిదం మీదున్నది వట్టిగపోదు గద. నానుంచి గాదని దివాళ తీసిన్నని మూడు బజార్ల దగ్గర కూచో – తలో మాటని వెళ్ళిపోతరు... బాకి ఖతమైతది" అన్నాడు కొండల్‌రావు.

"లసుమయ్య లంగైతడా?"

"నిజాయతీగ బతికినోడు..."

"పొలం పోయినంకేముంటది... ఎవ్వలేమనుకుంటేంది? కాయిదాలు చింపుతె అయిపోతది..."

అందరి మాటలు వింటున్నాడు లసుమయ్య. ఏ నిర్ణయం తీసుకోలేక పోతున్నా 'లంగ' అనిపించుకోవడానికి మనసొప్పడంలేదు.

తండ్రిని గమనిస్తున్నాడు కొంరయ్య. కొద్ది నిముషాలక్కడ మౌనమే రాజ్యమేలింది.

కొంరయ్య ముందుకొచ్చాడు. అతని ముఖంలో ఆవేశం, ఆందోళనలున్నాయి. నిగ్రహాన్ని బలవంతంగా తెచ్చుకుంటున్నాడు.

తాను షావుకారి మీదికి తిరగబడి రక్తపాతం సృష్టిస్తే జరిగేదేమిటో తనకు తెలుసు. తాను మాత్రమే కాదు, తన తరం వాళ్ళంతా ఆ కల్లోలానికి బలికాక తప్పదు. ఇలాంటి కల్లోలాలను గత రెండేళ్ళ క్రితం వరకూ ఊరెన్నోసార్లు చవిచూసింది. మళ్ళీ కల్లోలాన్ని సృష్టించడం తన కిష్టంలేదు?

తనలో తానేవేవో నిర్ణయించుకున్నాడు కొంరయ్య.

"అయ్యా! మా నాయిన్న సంగతి నాకు తెలుసు. అయినేం జేత్తడో కూడా నాకు తెలుసు. తీసుకున్న కొంచెం అప్పుకోసం తరతరాలుగా బానిసత్వం చేయమన్నా చేసే మనస్తత్వం అయనది. అది బాకీ కాకున్నా చర్మం ఒలిచి చెప్పులు కుట్టిచ్చైనా బాకీ తీర్చే తరం ఆయనిది. అందుకే తండ్రులు జేసిన బాకీలుగాని బాకీలకు దొరలిండ్లలో మొన్న మొన్నటిదాకా నెట్టి చేసిన వాళ్ళున్నారు. కాని, నాకది ఇష్టంలేదు. మా నాయిన్నకు కాగిదాలు చింపెయ్యడం న్యాయమే అయినా లంగని అనిపించుకోవడమిష్టంలేదు. మా నాన్న బాకీ కడ్తానన్నా నేనొప్పుకోను" అన్నాడు.

భార్యను గబగబా లాక్కొచ్చాడు అటూ ఇటూ చూసాడు. ఓ వ్యక్తి భుజమ్మీదున్న గొడ్డలి లాక్కున్నాడు. గొడ్డలి మొనను భార్యమెడ మీదుంచాడు.

"నాయిన్నా! ఊరిపెద్దలారా...! నేంజెప్పేది వినుండ్రి. ఈ గొడ్డలితోని నరకవల్సింది షావుకారిలాంటోన్ని. అట్ల చేస్తే తర్వాతేమైతదో మీ కందరికెరికే. నాకొక్కనికైతే ఫరవాలేదు. కాని, ఊరంతా బెగ్గం పాడైపోతది. మనమా పరిస్థితులను పది, పన్నెండేండ్లు చూసినం. మల్ల నాతోనే అట్లాకావడం నాకిష్టం లేదు.

నాయిన్నా! అట్లని నువ్వన్నదానికి నేను తలూపుతాననుకోకు. ఉన్న భూమిని విడిచిపెట్టుకొని నీలాగే బాకీల పాలై బతకడం నాకిష్టంలేదు. నా తల్లి జీవితాన్ని నా భార్యకివ్వడానికి నేను సిద్ధంగా లేను... నువ్వు ఆ అన్యాయపు బాకీ బాకీ కాదని లంగ అనిపించుకున్నా ఫర్వాలేదని అప్పుకాగితాలు చింపేస్తానో, నా భార్యనే నరుక్కోమంటావో నాకు చెప్పు..." అని ఆవేశంతో ఊగుతూ ఉగ్రనరసింహుడిలా నిల్చున్నాడు కొండయ్య.

అక్కడున్న వాళ్ళంతా నోళ్ళుతెరిచి భయం, భయంగా కొండయ్య దిక్కు చూస్తున్నారు.

లసుమయ్యకు కొడుకు భావాలనంగీకరించి కాగిదాలు చింపేయడానికి మనసంగీకరించడం లేదు. కొండయ్య తండ్రి భావాలకు తల ఒగ్గి గొడ్డలి దించడానికి సిద్ధంగా లేడు.

లసుమయ్య, కొండయ్యల మధ్య జరుగుతున్న ఈ సంఘర్షణ కేవలం తండ్రీ కొడుకుల మధ్య జరుగుతున్న సంఘర్షణ మాత్రమే కాదు - అది తరాల మధ్య సంఘర్షణ.

● 'అన్వేషణ' వారపత్రి, *9–8–95* ●

★ ★ ★